ప్రజాశక్తి
బుధవారం 21 ఆగస్టు 2024
5
పార్వతీపురం మన్యం

ఈ లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేయరాదు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని కొత్తవలసలో సర్వేనెంబర్ 125లో 3.69 ఎకరాల్లో గల వెంకటరమణ రియల్ ఎస్టేట్, బెలగాంలోని సర్వే నెంబరు 458/1బిలో 2.56 ఎకరాల్లో ఉన్న సాయి గార్డెన్ డెవలపర్స్‌లో స్థానిక ప్రజలు స్థలాలు, ప్లాట్లు కొనుగోలు చేయరాదని మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ లే అవుట్‌కు ఎటువంటి ప్రభుత్వ అనుమతుల్లేవని, ఒకవేళ ఎవరైనా కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్లు జరగవని, మున్సిపాలిటీ నుంచి భవన నిర్మాణానికి ఎటువంటి అనుమతులు రావని, మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించబడవని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ డిమాండ్

డాక్టర్ల సమ్మెకు మద్దతుగా విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల అయిందని, కానీ మహిళలకు మాత్రం స్వేచ్ఛ, స్వాతంత్ర్య రాలేదని, ఇది దేశ దౌర్భాగ్య పరిస్థితని ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు అన్నారు. కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్ మౌమితపై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి. పండు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ కోల్‌కత్తా విద్యాలయంలో ఒక మహిళా డాక్టర్ విద్యార్థినిపై అఘాయిత్యం జరిగి రెండు వారాలు గడుస్తున్నా నేటికీ సమగ్ర దర్యాప్తు చేపట్టకపోవడం అన్యాయమని, దేశంలో మహిళలకు రక్షణ ఏ రీతిలో ఉందో ఈ విచారణే నిదర్శనమని విమర్శించారు. కత్తువా, నిర్భయ, దిశ, మణిపూర్ ఘటనలతో దేశం అట్టుడుగిపోయిందని, నేడు కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యని తెలిపారు. చట్టాలు సమగ్రంగా అమలైతే ఇటువంటి అఘాయిత్యాలు జరిగే ఆస్కారం లేదని, చట్టాలు సంపన్న వర్గాలు, పెత్తందారుల చేతుల్లో పాచికల్లా ఉన్నంతకాలం మహిళల బతుకు దినదిన గండంలా నిలుస్తూ ఉంటుందన్నారు. ప్రపంచ యుద్ధాలతో తలపడతామన్న మోడీ మహిళా డాక్టర్ హత్యాచారానికి గురైనా నేటికీ స్పందించకపోవడం అమానుషమనానరు. ఇది డాక్టర్‌పై జరిగిన దాడి కాదని, భారత స్త్రీ వ్యవస్థపై జరిగిన ఉగ్రవాదమని వాపోయారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ హత్యను దారిమళ్లించేందుకే ప్రజాతంత్ర వాదులపై బురదజల్లే ప్రయత్నిస్తున్నారన్నారు. దోషులతో పాటు మమతపై కూడా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. నేటికీ దేశవ్యాప్తంగా సామాన్య ప్రజల నుంచి మేధావుల వరకు దాడిని ఖండిస్తూ నిరసనలు తెలియజేస్తున్నా కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తునకు చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమని అన్నారు. మన రాష్ట్రంలో కూడా చంద్రబాబు, జగన్, పవన్ కేంద్రంపై ఒత్తిడి పెంచాలని, ఆసుపత్రుల్లో గల నర్సులకు, వైద్యులకు, సిబ్బందికి తగిన ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డాక్టర్ మౌమిత డెబ్నత్‌ను అమానుషంగా హత్యాచారం చేసిన దుండగులను నిర్భయ చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పి. రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు డేవిడ్, అఖిల్, సురేష్, సింహాచలం, పట్టణంలో గల అన్ని విద్యాసంస్థల విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంలో భారీ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, యువత

బలిజిపేట : కోల్‌కత్తా లో వైద్య విద్యార్థిని హత్య చేసిన, బాధ్యులను కఠినంగా శిక్షించాలని స్థానిక బస్ స్టాండ్ వద్ద సిఐటియుజిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలకత్తా నగరం ఆర్‌జెకెఆర్ హాస్పిటల్‌లో వైద్య విద్యార్థిని దుర్మార్గంగా చంపడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దారుణానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలు తీయడం అత్యంత హేయమైన చర్యని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం, సిపిఎం నాయకులు బొద్దాన భానుమూర్తి, సుబ్బయ్య, పలువురు అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

కొమరాడ : కలకత్తాలో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, అనంతరం హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కూనేరు రామభద్రపురం పిహెచ్‌సి వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో కలిసి నిరసన చేపట్టారు. వైద్యురాలి మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం మాట్లాడుతూ వైద్యురాలి హత్యకు కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు గౌరీశ్వరి, నిర్మల,శ్రీదేవి రాజేశ్వరి, భారతి, గంగ, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో మానహారం చేస్తున్న విద్యార్థులు,స్కీం వర్కర్లు, ప్రజాసంఘాల నాయకులు

పివిటిజిల సమీకృత అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రిమిటివ్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పివిటిజి)ల సమీకృత అభివృద్ధే ధ్యేయం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. పిఎం జన్‌మాన్ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ అభివృద్ధి సూచికలు గణనీయంగా మార్పు చెందాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీరు, విద్య, ఆరోగ్యం, గృహాల కల్పన శత శాతం కల్పించే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రోడ్ల అనుసంధానం కాని గిరిజన ఆవాసాలకు రోడ్ల నిర్మాణానికి సమగ్ర అంచనాలతో ప్రతిపాదనలు సమర్పించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో అవసరమగు వసతి గృహాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వారం రోజుల్లో సమర్పించాలని ఐటిడిఎ అధికారులను ఆదేశించారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో నిర్మిస్తున్న ఏడు బహుళార్థక వినియోగ సామాజిక భవనాలు డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. మొబైల్ టవర్లను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ వందకు పైగా జనాభా కలిగిన 43 ఆవాసాలకు 38.65 కిలోమీటర్ల మేర 19 అనుసంధాన రహదారులు మంజూరు చేశామన్నారు. పరిపాలన అనుమతులు మంజూరు కావాల్సి ఉందన్నారు. సమావేశంలో జెసి ఎస్ఎస్ శోబిక, సీతంపేట ఐటిడిఎ ఇన్‌ఛార్జ్ వివి రమణ, డిఆర్ఒ జి.కేశవ నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

పివిటిజిని సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పక్కన జెసి, డిఆర్ఒ

వసతిగృహాల్లో తనిఖీలు నిర్వహించాలి

జిల్లాలోని అన్ని వసతిగృహాలు, చిన్నారుల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయాలని, వసతులు, వాటికి అనుమతులు ఉన్నదీ, లేనిదీ పరిశీలించాలని, అనుమతుల్లేని వాటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గల అన్ని ప్రభుత్వ, ప్రయివేటు వసతిగృహాలు, చిన్నారుల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయాలని, వాటిలో కల్పిస్తున్న వసతులు పరిశీలించాలని తెలిపారు. ప్రైవేట్ వసతి గృహాలు తనిఖీ చేసి అనుమతులు పరిశీలించాలని, తనిఖీలపై మండలాల వారీగా నివేదిక అందజేయాలని తెలిపారు. అనుమతుల్లేకుండా వసతిగృహాలు, సంకర్షణా కేంద్రాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఎంపిడిఒలు, బిసి, సోషల్ వెల్ఫేర్ అధికారులు వెంటనే అన్ని హాస్టళ్లను తనిఖీలు చేసి నివేదిక అందజేయాలని తెలిపారు. వార్డెన్లు వసతిగృహంలో ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి గయాజుద్దీన్, జిల్లా బిసి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు ఎస్.కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక, ఆతిథ్య రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పర్యాటక, ఆతిథ్య రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించాలని పారిశ్రామిక రంగ ప్రతినిధులు కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో నూతన పారిశ్రామిక విధానం క్రింద తయారి, సేవా రంగాలకు పెట్టుబడి రాయితీ, స్టాంప్ డ్యూటీ, విద్యుత్ రాయితీ, భూ మార్పిడి, జిఎస్ టి, వడ్డీ రాయితీ తదితర అంశాల్లో వివిధ రేట్లలో ప్రభుత్వ రాయితీ కల్పించిందన్నారు. ఎస్.సి, ఎస్.టి పారిశ్రామిక వేత్తలకు వివిధ విభాగాల్లో 45 శాతం నుండి వంద శాతం వరకు రాయితీ ఉందన్నారు. నూతన పారిశ్రామిక విధానం పై సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ మేరకు పారిశ్రామిక రంగ ప్రతినిధులు పి.వి.ఎస్ రామ్మోహన్ రావు తదితరులు మాట్లాడుతూ సింగిల్ విండో విధానంలో అన్ని అనుమతులు క్లియర్ కావాలని కోరారు. విద్యుత్ ధరలను ప్రక్క రాష్ట్రాల ధరలు మేరకు సవరించి, ఐదు ఐదేళ్ల వరకు కొనసాగించాలని సూచించారు. అనంతరం సందర్భంగా రామ్మోహన్ రావు ఎపి చాంబార్ ఆఫ్ కామర్స్ తరపున వినతి పత్రాన్ని అందించారు.

ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

చిత్తశుద్ధితో వైద్యులు సేవలందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రోగులకు వైద్యులు సేవలందించడంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనాల విజయచంద్ర జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్యులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వైద్యులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆసుపత్రి మొత్తం పర్యటించి ఏఏ సమస్యలు ఉన్నాయో గుర్తించారు. ఆసుపత్రికి వస్తున్న రోగులు, వారికి అందుతున్న సేవలు, వైద్యులు ఎంతమంది, సిబ్బంది ఎంతమంది ఉన్నారు, తదితర పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రిలో శానిటేషన్ పనిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం రోగులుండే ఆసుపత్రిలో పరిశుభ్రతకు అధిక ప్రాధన్యత ఇవ్వాలని సూచించారు. రక్తనిధి కేంద్రం, సిటీ స్కాన్, ఎక్స్‌రే, డయాలసిస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే ల్యాబ్‌లను ఆయన పరిశీలించారు. వాటి కాలపరిమితి, రక్త సేకరణ తదితర అంశాలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో సేవలు పరిస్థితిపై రాజీలేదని ప్రభుత్వపరంగా అన్ని విధాలా ప్రోత్సాహం ఉంటుందన్నారు. అలాగే రోగులకు సేవలందించడంలో వైద్యులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు. జిల్లా ఆసుపత్రిగా మారినప్పటికీ అందుకు తగ్గ మౌలిక సౌకర్యాల్లేవని, వాటిని సమకూర్చేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. జిల్లాలోని పలు మండలాలకు జిల్లా ఆసుపత్రి ప్రధాన ఆధారమని, ఇక్కడి నుంచి ఒక్క కేసు కూడా విశాఖ, విజయనగరానికి రిఫర్ కాకుండా అన్ని సౌకర్యాలు ఇక్కడే ఉండేలా ఏడాదిలో ఆసుపత్రిని సిద్ధం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆధునీకీకరణ పనులు నిలిచిపోవడంపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రికి అదనంగా మంజూరైన 50 పడకల అదనపు భవననిర్మాణంపై ఆయన ఆరా తీశారు. అందరి సహకారంతో పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాగ్దేవి, వైద్యులు, సిబ్బంది, టిడిపి నాయకులు బార్నాల సీతారాం, సిరిపురపు భాస్కరరావు, జాగాన రవికుమార్, గౌరజాన చంద్రమౌళి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు పాల్గొన్నారు

అక్టోబర్ 15న సిరిమాను సంబరం

14న తొలేళ్ల ఉత్సవం • పైడితల్లమ్మ ఉత్సవాల తేదీలు ఖరారు

ప్రజాశక్తి-విజయనగరం

పైడితల్లమ ఉత్సవాల తేదీలు ఖరారయ్యాయి. ఈ ఏడాది అక్టోబర్ 15న పైడితల్లమ్మ సిరిమాను సంబరం జరగనుంది. పైడితల్లమ్మ ఉత్సవాల తేదీలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డివివి ప్రసాదరావు వెల్లడించారు. మంగళవారం అమ్మవారి అన్నప్రసాద భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్సవాల తేదీలను ప్రకటించారు. రాష్ట్ర పండుగగా అమ్మవారి జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 20న మండల దీక్షలు, పందిరిరాటతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అక్టోబర్ 10న అర్ధ మండల దీక్షలు, 14న తొలేళ్ల ఉత్సవం, 15న ప్రధాన ఘట్టం సిరిమాను సంబరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 22న తెప్పోత్సవం, 27న కలశ జ్యోతి ఊరేగింపు, 29న ఉయ్యాల కంబాల, 30న చండీహోమంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో అమ్మవారి జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఉత్సవాల నిర్వహణపై త్వరలోనే జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు మాట్లాడుతూ దసరా ముగిసిన వెంటనే వచ్చే మంగళవారం అమ్మవారి సిరిమాను జాతర నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. ఆ ప్రకారమే ఈ ఏడాది జాతర తేదీలను నిర్ణయించామని చెప్పారు. తాను వరుసగా 8వ ఏట సిరిమాను అధిరోహిస్తున్నట్లు వివరించారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి : ఎపిఒ

ప్రజాశక్తి -సీతంపేట

ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఐటిడిఎ ఎపిఒ చినబాబు అన్నారు. మండలంలోని బుడగరాయి ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ :గిరిజన సంక్షేమ, ఇతర వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల, కెజిబివి, గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను డిప్యూటీ తహశీల్దార్ శివయ్య, స్థానిక ఎస్ఐ నీలకంఠం తదితరులు పరిశీలించారు. ముందుగా వసతి గృహాల్లో వండుతున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం నాణ్యమైన, మంచి రుచికరంగా అందించాలని స్పష్టం చేశారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ ఊహించాలని అన్నారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే తక్షణమే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు.

పోస్టుమార్టం అనంతరం ఆటోలో గ్రామానికి తీసుకొచ్చిన అక్కాచెల్లెల్ల మృతదేహాలు

మరణంలోనూ వీడని స్నేహం

బావిలోకి దూకి అక్కాచెల్లెల్లు ఆత్మహత్య

ప్రజాశక్తి - పాచిపెంట

వారిద్దరు వరుసకు అక్కాచెల్లెల్లు. అంతకు మించి మంచి స్నేహితులు. వారి స్నేహబంధాన్ని చూసి, ఎవరికి కన్ను కుట్టిందో గానీ విధి వారిని దూరం చేయాలని చూసింది. అందులో ఒకరికి అనుకోని కష్టమొచ్చింది. దీంతో తనకు జీవితంపై ఆశ లేదని, చనిపోతానని తోటి స్నేహితురాలికి చెప్పింది. నీతోపాటు నేనూ వస్తానంటూ స్నేహితురాలి మరణంలోనూ తోడెళ్లింది. మృత్యువు కూడా వారి స్నేహబంధాన్ని విడదీయలేకపోయింది. ఈ విషాదకర సంఘటన పాచిపెంట మండలం బొర్రమామిడి పంచాయతీ బొడ్డపాడులో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం..

మండలంలోని బొర్రమామిడి పంచాయతీ బొడ్డపాడుకు చెందిన సేబి సోంబారమ్మ (24), పోయి లక్ష్మి (18) వరుసకు అక్కా చెల్లెల్లు. వీరు మంచి స్నేహితులు. సోంబారమ్మకు అదే గ్రామానికి చెందిన యువకుడితో పెద్దల సమక్షంలో వివాహం కుదిరింది. అయితే గత వారం రోజులుగా ఆ జంట మధ్య మనస్పర్థలు రావడంతో వివాహం రద్దయింది. దీంతో సోంబారమ్మ తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ విషయమై తన స్నేహితురాలైన లక్ష్మి వద్ద తాను బతకనని, చనిపోతానంటూ వాపోయింది. నీవు లేకపోతే నేను కూడా బతకనని, చావైనా, బతుకైనా ఇద్దరం కలిసే చనిపోదామంటూ నిశ్చయించుకున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి గ్రామ సమీపాన ఉన్న నేల బావి వద్దకు చేరుకున్నారు. చున్నీతో ఇద్దరూ చేతులకు కట్టుకుని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. రాత్రంతా వీరు ఇంటికి రాకపోవడంతో బంధువులు చుట్టుపక్కలా వెతికారు. మంగళవారం ఉదయం నేలబావిలో వీరి మృతదేహాలు తేలియాడడాన్ని స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ పి.నారాయణరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సిహెచ్‌సి తరలించారు. పాచిపెంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహనతో వ్యాధులు దూరం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

దోమల వ్యాప్తిని అరికట్టడానికి పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయ పార్వతి అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా స్థానిక మలేరియా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి డిఎంహెచ్ఒ, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ పార్వతి మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, ఫైలేరియా మొదలగు వ్యాధులు, అవి సోకడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, డ్రైడే పాటించాలని తద్వారా ఇలాంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఆరోగ్య విద్య, కళాజాత, గోడ పత్రికలు, కర పత్రికలు ద్వారా విస్తతంగా అవగాహన కల్పించి, ప్రజల భాగస్వామ్యం ద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాదుల నుండి రక్షణ కల్పించి ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంగా పనిచేయాలని కోరారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహన్ రావు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా దృష్టి సారించాలని, దోమల నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టి వారి ఆరోగ్య శ్రేయస్సుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్బిఎస్ కె ప్రోగ్రాం అధికారి రఘుకుమార్, నోడల్ అధికారి ఎం. వినోద్, విబిడి కన్సల్టెంట్ రామచంద్ర, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, మలేరియా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గరుగుబిల్లి : ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండలంలోని కొత్తపల్లిలో వైద్యాధికారి డాక్టర్ సాగర్ వర్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాగర్ వర్మ దోమల ద్వారా వచ్చే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఉదయకుమారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి సిహెచ్ ధనుంజయ కుమార్, రామకష్ణ, పకీరు నాయుడు, విజయలక్ష్మి, జానకి, దుర్గాప్రసాద్, శంకరావు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని మర్రిపాడు, దోనుబాయి, కుసిమి పిహెచ్‌సిల పరిధిలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. దోమలు నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మర్రిపాడు ఆయుష్ వైద్యాధికారి తిరుపతిరావు, చాందిని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దోమ కుట్ట కూడదు, దోమల బారిన పడకూడదని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, సూపర్వైజర్లు జనార్దన్ రావు, శాంత కుమారి, ఆదిలక్ష్మి, ఆనంద్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటులో తప్పలను సవరించాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలో కొన్ని మండలాల్లోని పాఠశాలకు చెందిన పని సర్దుబాటులో జరిగిన తప్పులను సవరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి,రమేష్, ఎస్.మురళీమోహనరావు డిఇఒ జి.పగడాలమ్మను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమెకు వినతిని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ బయాలజీ మిగిలి పోస్టులుగా ఉన్నాయి. ఆ స్కూలులో పనిచేస్తున్న సీనియర్లకు అవకాశం ఇవ్వమని ఎంఇఒను అడిగితే ఇవ్వకుండా తాత్సారం చేశారని అన్నారు. జూనియర్లతోనే కౌన్సిలింగ్ నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని అన్నారు. అలాగే 2008 డిఎస్‌సి టీచర్లను 1998 ఎంటిఎస్ టీచర్ల కన్నా జూనియర్‌గా చూపించారని వీటిని సరిచేయాలని డిఇఒను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.మురళి, నాయకులు బి.మురళీకృష్ణ, వసంత నాయుడు పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, వసతి గృహ నిర్వాహణలో ప్రత్యేక శ్రద్ధ సంరక్షకులు చూపాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వార్డెన్లను కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో నియోజకవర్గ పరిధిలోని బిసి, సోషల్ వెల్ఫేర్ వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు సదుపాయాలు గురించి వాకబు చేశారు. వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య నానాటికి తగ్గిపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల నిర్వహణలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఉన్న అపోహాలను తొలగించాలని, పాఠశాలల్లో పర్యటించి విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమ అధికారి అప్పన్నతో పాటు వివిధ హాస్టల్లో వార్డెన్లు పాల్గొన్నారు.

అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం జాబ్ మేళా జరిగింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా చేపట్టిన జాబ్ మేళా కార్యక్రమంలో అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిక్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు హాజరయ్యాయి. ఈ జాబ్ మేళాలో 62 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, అందులో 29 మంది అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు ఎంపికయ్యారు. మరో 18 మంది రిక్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎంపికయ్యారు. ఈమేరకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరాలనే అకుంఠిత దీక్షతో పని చేయాలన్నారు. ఒక నిర్దిష్ట లక్ష్యం, ఆశయంతో జీవితానికి సోపానాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, జిల్లా డిపిఆర్ఒ లోచర్ల రమేష్, కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు.

పైపులైనుకు రంధ్రం... తాగునీరు వృథా

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని గోపాలపురానికి మూడు రోజులుగా తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చే మంచినీటి పైపునకు కోన గ్రామంలో పెద్ద రంధ్రం ఏర్పడడంతో తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగింది. ఇక్కడ తాగునీరు వృధాగా పోవడమే కాకుండా మురుగునీరు చేరి తాగునీరంతా కలుషితమవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి వృధాగా పోతున్న తాగునీటిని అరికట్టి గోపాలపురానికి తాగునీరు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. తాగునీటి పైపుకి రంధ్రం పడి వృధాగా పోతున్న విషయాన్ని అధికారులకు తెలిపినట్టు సర్పంచ్ మహాలక్ష్మి తెలిపారు.

గ్రామ సభలను సమర్ధవంతంగా నిర్వహించాలి

పార్వతీపురం రూరల్ : ఈనెల 23న నిర్వహించబోయే గ్రామ సభల్లో పెద్ద ఎత్తున గ్రామస్తులు, వేతనదారులు పాల్గొనేలా సమర్ధవంతంగా నిర్వహించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నియోజకవర్గానికి చెందిన ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, ఇసిలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఆర్థిక సంవత్సరం గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు, తీర్మానాలు లేనివిధంగా నిర్వహించాలని, రెండు రోజులు ముందుగానే గ్రామాల్లో దండోరా వేయించాలని ముందుగానే అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో డిపిఒ బి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యమనాయుడు మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిరంతరం క్లస్టర్ స్థాయిలో పనులను సందర్శించాలని, పనులు సక్రమంగా జరిగే బాధ్యతను ఎంపిడిఒలు తీసుకోవాలని కోరారు.

యు.వెంకంపేటలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేటలో మంగళవారం స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులతో పాటు వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

పార్వతీపురం రూరల్ : మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిని పూర్తి చేయలని ఎంపిడిఒ అకిబ్ జావేద్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, గ్రామ సచివాలయ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 50 లేఔట్లలో 948కు గాను 438 ఇళ్లు పూర్తి కావచ్చాయని, ఇంకా పెండింగ్ ఉన్న 510 ఇళ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఇఒపిఆర్ డి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, వసతి గృహ నిర్వాహణలో ప్రత్యేక శ్రద్ధ సంరక్షకులు చూపాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వార్డెన్లను కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో నియోజకవర్గ పరిధిలోని బిసి, సోషల్ వెల్ఫేర్ వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు సదుపాయాలు, వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య నానాటికి తగ్గిపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల నిర్వహణలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఉన్న అపోహలను తొలగించాలని, పాఠశాలల్లో పర్యటించి విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎసిబిడబ్ల్యుఒ అప్పన్న, వివిధ హాస్టల్లో వార్డెన్లు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

సీతంపేట : మండల కేంద్రంలో గల కెజిబివి, మినీగురుకులాలను జిసిడిఒ రాములమ్మ సందర్శించారు. వంటగది, మరుగుదొడ్లు పరిశీలించి, క్వాలిటీ ఫుడ్ అందించాలని అన్నారు. పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు సులభ పద్ధతుల బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని గడ్డి కాలనీకి చెందిన పాస్టర్ నిమ్మక రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో దాతలు ఇచ్చిన రూ.10వేలు విరాళాన్ని సర్పంచి గౌరీ శంకర్రావు చేతుల మీదుగా అందించారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

పార్వతీపురంటౌన్: పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌డిఎం ఎ.నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మున్సిపాల్టీకి వచ్చారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, డిఇ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పట్టణంలో జరుగుతున్న పూడికతీత పనులను, అన్నా క్యాంటీన్‌ను, అపార్ట్మెంట్లను, పాఠశాలలో జరుగుతున్న హెూమ్ కంపోస్ట్ జరిగే తీరును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు పడుతున్న దృష్ట్యా పట్టణంలో అన్ని వాటిల్లోనూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజలకు శుద్ధ జలాలను అందించాలని అధికారులకు సూచించారు.

ఎయిడ్స్‌పై అపోహలు వీడాలి

వీరఘట్టం : ఎయిడ్స్‌పై అపోహలు వీడాలని వైసిబిటిఐ సౌజన్య తెలిపారు. మండలంలోని కడకల్లలో మంగళవారం హెచ్ఐవి సుఖ వ్యాధులు, హెచ్ఐవి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కండోమ్ ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సూచన మేరకు ప్రభావిత గ్రామాలైన కడకల్లలో అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎస్ ఎన్ పి ప్లస్ కేర్ అండ్ సపోర్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సిఎస్‌సి నుంచి లక్ష్మణ, రాంప్రసాద్, బి అనురాధ, ఆర్.లక్ష్మి, వైసిబిటిఐపియు నుంచి ఎం.శ్రీదేవి, రాజేశ్వరి, గ్రామ సర్పంచ్ డి.సుజాత శ్రీనివాస, ఎఎన్ఎం శకుంతల, హారిక, ఆశా కార్యకర్త జి.సుజాత పాల్గొన్నారు.

కడకల్లలో అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, వైద్య సిబ్బంది

పరిశోధనా ఫలితాలు రైతులకు అందించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వ్యవసాయ పరిశోధనా ఫలితాలను రైతుల ఆదాయం పెంచుటకు వారికి అందుబాటులోనికి తీసుకురావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన, పౌల్ట్రీ, న్యూట్రిషియన్ వంటి అంశాలలో చేస్తున్న పరిశోధనలను గుర్తించి శాస్త్రవేత్తలు కలెక్టరుకు వివరించారు. వారు తయారుచేసిన వస్తువులను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ పరిశోధనలు తోడ్పాటునందించాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్ర పరిశోధనా ఫలితాలను రైతుల చెంతకు తీసుకువెళ్లాలని, జిల్లా వాతావరణానికి సరిపోయే నూతన వంగడాలు అందించాలని, అవగాహనా కార్యక్రమాలు, శిక్షణ తరగతులు నిర్వహించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించాలన్నారు. జీడిమామిడిలో సరాసరి దిగుబడి తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు తెలుపగా, అధిక దిగుబడి సాధించుటకు మెరుగైన యాజమాన్య పద్దతులపై రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఫైనాపిల్, పసుపు ప్రాసెసింగు యూనిట్ల స్థాపనకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. అలాగే జిల్లాలో ఎక్కువగా సాగయ్యే ఫైనాపిల్‌లో మారిషస్ వెరైటీ, పసుపులో అధిక దిగుబడి, నాణ్యత గల ప్రగతి రకం నూతన వంగడాలు జిల్లాలో ప్రవేశపెట్టాలని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం పురం మండలంలో 40 హెక్టార్లతో మారిషస్ రకం ఫైనాపిల్ సాగుకు విత్తనమొక్కలు తెప్పించాలని అధికారులను ఆదేశించారు. మనబడి-మనతోట కార్యక్రమం ద్వారా జిల్లాలో గల అన్ని పాఠశాలలు, వసతి గృహాలలో ఆకుకూరలు, కాయగూరలు పండించుటకు కావలసిన విత్తనాలను సరఫరా చేయాలని, ఆకుకూరల విత్తనాలు ఎక్కువగా ఉండేలా విత్తన ప్యాకెట్లను అందించాలని తెలిపారు. జిల్లాలో సిరిధాన్యాలు సాగును పెంచాలన్నారు. సిరిధాన్యాలతో న్యూట్రిషియన్ శాస్త్రవేత్తలు తయారు చేస్తున్న వస్తువులపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, అక్కడ సదుపాయాలను వినియోగించుకొని అక్కడే తయారు చేసుకొని, అమ్ముకొనేందుకు చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ పీడీని ఆదేశించారు. అలాగే మిల్లెట్స్‌తో క్యాండీ తయారీ యూనిట్ నెలకొల్పాలన్నారు. పౌల్ట్రీ సంబంధించి త్వరగా పెరిగే గ్రామప్రియ, శ్రీనిధి రకాల అయిదు వేల కోడిపిల్లలను డిఆర్‌డిఎ ద్వారా స్వయం సహాయక బృందాలకు అందించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, కెవికె ప్రోగ్రాం కో ఆర్డినేటరు ఎస్. ధ్రువ, శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఆర్‌సిఎం కార్యాలయం వద్ద ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ 2024- 25 విద్యా సంవత్సర ప్రవేశాల పోస్టర్‌ను జిల్లా కోఆర్డినేటర్ ఎం.సుధాకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14ఏళ్లు నిండి చదవడం, రాయగల పరిజ్ఞానం కలవారు, పదో తరగతి ఫెయిల్ అయిన వారు, బడి మధ్యలో మానేసి 14 ఏళ్లు నిండిన వారికి పదో తరగతి చదువుకునే అవకాశమని అన్నారు. అలాగే 15ఏళ్లు నిండి పదో తరగతి పూర్తి అయిన వారంతా ఇంటర్మీడియట్ మానేసిన ఫెయిల్ అయిన వారికి ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉందని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 31లోపు ఫీజు చెల్లించి ఓపెన్ స్కూల్ కోర్సులో చేరవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎన్.సత్యనారాయణ, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి పాఠశాల పరిశీలన

సీతానగరం : స్థానిక ప్రాథమిక పాఠశాల నుంచి రాష్ట్ర మోడల్ ఫౌండేషన్ స్కూల్ బృందం మంగళవారం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో ఒకటి, రెండు తరగతుల పిల్లలకు కార్యక్రమాలను పరిశీలించారు. అంగన్వాడీలోని పిల్లలు అభ్యాసన కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.దేవుడమ్మ, ఎఎంఒ బి.శ్రీనివాసరావు, ఎపిఒ వై.హరిప్రసాద్, రాష్ట్ర ప్రదం టీము సభ్యులు గీత రమ్య, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన

పాచిపెంట : రాష్ట్ర ప్రభుత్వం గిరిజన పంచాయితీలు ఎక్కువగా ఉన్న మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్ర శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశాల మేరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు తహశీల్దార్ డి.రవి, డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాజశేఖర్ మంగళవారం స్థల పరిశీలన చేశారు. వీరితో పాటు ఆర్ఐ రమణారావు, విఆర్ఒ ప్రశాంత్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం మంగళవారం నుంచి సెప్టెంబరు 18వరకు వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ఆమె క్యాంపు కార్యాలయంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ, బ్రూ సెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల గోడపత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నియోజకవర్గ పరిధిలో గల ఐదు మండలాల్లో పాడి రైతులంతా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కోరారు. పాడి పశువుల సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ చూసుకోవాలన్నారు. అనంతరం పశు వైద్యాధికారి పేకాపు లక్ష్మణరావు మాట్లాడుతూ పశువ్యాధి లక్షణాలు, వ్యాధి వల్ల కలిగే నష్టాలు రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. వ్యాధికి టీకాయే మార్గమని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, నాయకులు అడ్డాకుల నరేష్, కొణిశ మన్మథ, పశు వైద్య సిబ్బంది ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో పశువులకు వైద్య సేవలు

మండలంలోని దుడ్డుఖల్లు, గొరడ, గుమ్మలక్ష్మీపురంలో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు టీకాలు వేశారు. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 200 పశువులకు టీకాలు వేశారు.ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి లక్ష్మణరావు, వెటర్నరీ అసిస్టెంట్లు ఉన్నారు.

కురుపాం : మండలంలోని గుమ్మలో 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మంగళవారం వేసినట్లు వెటర్నరీ వైద్యాధికారి కె.శైలజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులను పెంచిన ప్రతి రైతు వర్షాకాలం నేపథ్యంలో పశువుల శాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా తప్పనిసరిగా పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని, అప్పుడే వ్యాధి బారిన పడకుండా ఉంటాయని, లేనిచో వ్యాధి బారిన పడి మృతి చెందే అవకాశాలు కూడా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధి నివారణకు టీకా మహోత్సవాలు

పార్వతీపురం రూరల్ : జిల్లాలో పాడి పశువులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా టీకాలు వేసే కార్యక్రమం జిల్లాలో ప్రారంభమైనట్లు పశుసంవర్ధక శాఖ ఎడి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని పెదబొండపల్లిలో పశువుల ఆసుపత్రిలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి వైద్యులు చక్రధరరావు చేతుల మీదుగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో చూడు, రక్షణకు బసిల్లోసిస్ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో వన్ ఫైవ్ వన్ డబల్ జీరో పశువులను టీకాల కొరకు ఎంపిక చేశామని, వీటిలో 7500 చూడి పశువులకు తొలి విడతగా టీకాలు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం మంగళవారం నుండి సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుందన్నారు. కావున జిల్లాలోని పశు పెంపకం దారులు తమ పశువులకు తప్పనిసరిగా ఈ టీకాలు వేయించుకోవాలని కోరారు. కాళ్ల సంచ, నోటిసంచ వ్యాధులకు సోకకుండా ముందస్తుగా ఈ టీకాలు సహాయపడతాయని, వివరాలు గ్రామాల్లోని పశువైద్య సహాయకులు అడిగి తెలుసుకోవాలని కోరారు.

గరుగుబిల్లి: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నట్టు మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు టీకాలను వేస్తున్నామన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాలికుంటు వ్యాధి గోడపత్రికలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గ్రంథాలయంలో వార్షిక తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

వార్షిక తనిఖీల్లో స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమారురాజా తనిఖీలు నిర్వహించారు. అన్నీ సక్రమంగా ఉన్నాయని, అయితే గ్రంథాలయానికి దారి ఒక్కటే సమస్యగా ఉందని అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిపోయిన పిఒ రాహుల్ కుమార్ రెడ్డి గ్రంథాలయానికి రహదారి సౌకర్యం కల్పిస్తానన్నారు. కానీ ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో మళ్లీ సమస్య మొదటికొచ్చింది. అతనితో పాటు గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి వివి శంకర్, స్థానిక గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తరలింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యుత్ శాఖ అధికారులు రోడ్డుపై విడిచిన పెట్టిన చెట్ల కొమ్మలను మంగళవారం మున్సిపల్ అధికారులు తరలించారు. 'ప్రజాశక్తి'లో సోమవారం ప్రచురితమైన తొలగించారు.. వదిలేశారు.. అన్న వార్తకు స్పందించిన పాఠశాల ఆవరణల్లోనూ, రోడ్లపై అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు మంగళవారం పారిశుధ్య కార్మికులు సహాయంతో తొలగించారు. విద్యుత్ సరఫరా నిర్వహణలో భాగంగా విద్యుత్ శాఖ సిబ్బంది చెట్లను తొలగించిన రోడ్డుపై కొమ్మలను విడిచిపెట్టారు. దీంతో విద్యార్థులు, ద్విచక్ర వాహన చోదకులు అవస్థలుపడ్డారు. ఈ విషయమై పత్రికలో వచ్చిన వార్తకు అధికారులు వీటిని తొలగించడంతో విద్యార్థులు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంస్థల్లో ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని కోరుతూ బుధవారం పార్వతీపురంలోని గిరిజన సామాజిక భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు పాలక రంజిత్‌కుమార్ తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని గిరిజన సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

నిరసన తెలుపుతున్న మహిళలు

రక్తదాతలకు ధ్రువపత్రాలను అందజేస్తున్న డిఎస్‌పి కృష్ణారావు

చెత్తను తక్షణమే తరలించాలి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఎదురుగా ఉనన చెత్తను తక్షణమే తరలించాలని పట్టణ పౌర సంఘాల ప్రతినిధి దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక మహిళలతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకవైపు గ్రంథాలయం, మరో వైపు వాటర్ ట్యాంకు, చేపల మార్కెట్, కాయగూరలమార్కెట్, పాలకొండ పట్టణ పౌరులతో పాటు, వివిధ గ్రామాల నుండి వచ్చే వారితో ఈ ప్రాంతం నిరంతరం రద్దీగా ఉంటుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఈ చెత్తను తరలించేందుకు పాలకవర్గం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారి యంత్రాంగం వివాద స్థలాలు పేరున కాలయాపన చేయకుండా, ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి తక్షణమే డంపింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పాలకవర్గం, స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి, శాశ్వత పరిష్కారానికి డంపింగ్ యార్డ్ స్థలం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. స్థలం లేదన్న పేరుతో పట్టణానికి నడిబొడ్డున ఉన్న కార్యాలయం ఎదుట చెత్తను వేయడం దురదృష్టకరమైన చర్యఅని, దీన్ని తక్షణమే తరలించాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు... ఆరోగ్యం బాగు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రకృతి కూరగాయల సాగు పంటలను పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాల ఆవరణంలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో చిక్కుడు, వంకాయ, బెండకాయ, ఆనపకాయ, మొక్కజొన్న, తోటకూర, గోంగూర వంటి ప్రకృతి సాగులో వివిధ రకాల పంటలను పండిస్తున్నారు. చేతికి వచ్చిన పంటను పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్నట్లు హెచ్ఎం పాలక దేవానంద్ తెలిపారు. ఎరువులేని పంటతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

సామాజిక కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు అన్నివేళలా ముందుండాలని డిఎస్‌పి కృష్ణారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం ఎపి ఎన్జీవో సంఘం, రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్-1,2 ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని డిఎస్‌పి ప్రారంభించారు. సుమారు 105 మంది రక్తదాతలు హాజరుకాగా, 84 మంది రక్తదానం చేశారు. డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు రెవెన్యూ, ఇతర ఉద్యోగులు, సత్యసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సంఘాలను అభినందించారు. ఉమ్మడి జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షులు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు ఉద్యోగులు మరిన్ని చేపట్టాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్యామ్ బాబు మాట్లాడుతూ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఒ బి.రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్జీవో అధ్యక్షులు కిశోర్, గౌరవాధ్యక్షులు లిల్లీ పుష్పనాథం కో ఆపరేటీవ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు జానకీరాము, స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ నర్సింహమూర్తి, డివిజన్ అధ్యక్షులు రంగాచారి, ప్రధాన కార్యదర్శి పైల ఈశ్వరరావు, సహ అధ్యక్షులు రమేష్ కుమార్, ఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి : డిఎస్‌పి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలపై ప్రత్యేక దృష్టిసారించాలని పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు పోలీసులకు సూచించారు. నాటు సారా అక్రమంగా తరలించిన, అమ్మకాలు వంటకాలు చేపట్టినా అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి, నాటు సారా వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఎల్విన్‌పేట చెక్ పోస్ట్ పరిశీలించి పలు సూచనలు చేశారు. తొలుత ఎల్విన్ పేట సర్కిల్ పరిధిలోని గుమ్మ లక్ష్మీపురం, కురుపాం పోలీస్ స్టేషన్ల పరిధిలో నాటు సారాతో పట్టుబడిన 8 మోటారు సైకిళ్లను వేలం పాట వేశారు. కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

పార్వతీపురం టౌన్ : మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ రవీంద్రరాజ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ లైసెన్సు లేనివారు వాహనాలు నడప రాదని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్నవాళ్లు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, కాలేజీ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రతి రైతు సేవా కేంద్ర పరిధిలో గల ఒక్కరైతైనా ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంభించేలా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. సాలూరు రైతు సేవ కేంద్రంలో మండల పరిధిలో గల ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్క ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాధ్యతగా ప్రతి రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి ఎటిఎం మోడల్ కూరగాయల విధానాన్ని ఆ రైతుతో చేయించేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఎటిఎం మోడల్ కూరగాయల నమూనాను పరిశీలించారు. అందులో భాగంగా బంగారమ్మ కాలనీ లో గల కొట్యడా శ్రీనివాస రావు వేసిన ఆర్‌జిఎల్ 7034 మినీ కిట్ వరి ప్రదర్శన క్షేత్రాన్ని సందర్శించారు. ఇది సాంబమసూరి కన్నా 10 రోజులు ముందుగా కోతకు వస్తుందన్నారు. అనంతరం అక్కడే అగ్నేయాస్త్రం తయారీ విధానాన్ని పరిశీలించారు. ఆ తరర్వాత సాలూరులో గల ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ లో విత్తన పరీక్షను పరిశీలించారు. కార్యక్రమంలో సాలూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రావు, మండల వ్యవసాయ అధికారి అనురాధ పండా, విఎఎలు ప్రమీల, ఎపిసిఎన్ఎఫ్ కోఆర్డినేటర్ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం విద్యకు ఇస్తున్న సౌకర్యాలను సద్వినియో గం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు సూచించారు. మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల బాలికల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శిం చారు. తల్లిదండ్రుల కన్న కలలు నిజం చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదికి వెళ్లి భోజనం రుచి చూశారు. పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు. వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యం కాపాడు కోవాలన్నారు. కార్యక్రమ ంలో తహశీల్దార్ అప్పారావు, సిఐ సత్యనా రాయణ, ఎస్ఐ శివప్రసాద్, ప్రిన్సిపల్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

చౌకబారు విమర్శలు చేసే అలవాటు లేదు : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

చౌకబారు విమర్శలు చేసే అలవాటు తనకు లేదని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. మంగళవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బాధ్యత గల పదవుల్లో ఉన్న నాయకులు ఒకటికి పదిసార్లు ఆలోచించి మాట్లాడాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తాను చౌకబారు విమర్శలు చేశానని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. కొద్దిరోజుల క్రితం కొటికిపెంట ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల మృతదేహాలను ఏరియా ఆసుపత్రిలో సందర్శించడానికి ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావుతో కలిసి తాను వెళ్లానని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు, ఇతర అధికారులతో మాట్లాడి మతదేహాలను విమానం ద్వారా తరలించాలని కోరానని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి స్పందించాలని డిమాండ్ చేశానని చెప్పారు. దీనికి సిఎం చంద్రబాబు స్పందించి ఉపాధ్యాయుల మృతదేహాలను విమానం ద్వారా తరలించేందుకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఏకలవ్య పాఠశాలలో ఉద్యోగాలను టిడిపి ప్రభుత్వమే భర్తీ చేసుకున్నారని, కానీ భవనాల నిర్మాణం ప్రారంభించలేదని చెప్పారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకలవ్య పాఠశాలల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సకాలంలో బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేశారని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఏకలవ్య పాఠశాల నిర్మాణం పై దష్టి సారించాలని కోరారు నియోజకవర్గంలోని అనేక వంతెనలు,రోడ్ల నిర్మాణానికి తాను మంత్రిగా వున్నప్పుడే ప్రతిపాదనలు పంపించానని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కింద రూ.1.6 కోట్లతో పారమ్మ కొండకు రోడ్డు నిర్మాణానికి మార్చిలోనే అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. ఇటీవల మంత్రి సంధ్యారాణి తానే పారమ్మకొండకు రోడ్డు మంజూరు చేయించానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులు చూపించి తానే మంజూరు చేయించానని మంత్రి డబ్బా కొట్టుకోవడం సరికాదని రాజన్నదొర హితవు పలికారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మద్దిల గోవింద రావు, యశోదకృష్ణ ఉన్నారు.

తల్లి మందలించిందని...

పాచిపెంట : మండలంలోని పాంచాలికి చెందిన మహిసర్ల శంకర్రావు (21) గడ్డి మందు తాగి సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. పాంచాలికి చెందిన మహిసర్ల శంకర్రావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో మరమ్మతుకు గురి కావడంతో మరమ్మతుల నిమిత్తం తల్లిని రూ.30 వేలు అడిగాడు. ఇప్పుడు అంత డబ్బులు తనవద్ద లేవని తల్లి అనడంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. దీంతో శంకర్రావు మనస్థాపానికి గురై ఈనెల 15న తమ పొలంలో గడ్డి మందు తాగి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు గమనించి విషయం తెలుసుకొని సాలూరు సిహెచ్‌సికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి గణపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎఎస్ఐ బి.ముసలయ్య తెలిపారు.